జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

మంగళవారం 20-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :234 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

## మేడారంలో గద్దెల పునఃప్రారంభం

**కటుఉంబంతో కలసి పాల్గొన్న సిఎం రేవంత్**



ములుగు,జనవరి19(ఆర్ఎన్ఎ): మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను రేవంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క, కొండా సురేఖ, వరంగల్ మేయర్ సుధారాణి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిఎం మేడారం రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భారత్‌కు యూఏఈ అధ్యక్షుడు..

### స్వయంగా స్వాగతం పలికిన మోదీ



- **ఘన స్వాగతం:** యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఢిల్లీ పర్యటనకు రాగా, ప్రధాని మోదీ స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.
- **స్వల్పకాలిక పర్యటన:** విదేశాంగ శాఖ సమాచారం ప్రకారం, అల్ నహ్యాన్ ఢిల్లీలో కేవలం రెండు గంటలు మాత్రమే గడపనున్నారు.
- **చర్చాంశాలు:** ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ మరియు ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై నేతలు చర్చలు జరపనున్నారు.
- **వ్యూహాత్మక ప్రాధాన్యత:** పశ్చిమ ఆసియాలో (ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, గాజా సంక్షోభం, యెమెన్ అంశం) అస్థిర పరిస్థితులు నెలకొన్న వేళ ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం చేసి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. అయితే, విదేశాంగ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అల్ నహ్యాన్ కేవలం రెండు గంటలే ఢిల్లీలో ఉండనున్నట్లు తెలుస్తోంది.

"సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఇరుదేశాల మధ్య స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన చాటుతోంది" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. పేజి 2లో

## సిరిసిల్ల పవర్‌లూమ్‌పై కేంద్రం వివక్ష

- పదేళ్లుగా కోరుతున్నా పట్టించుకోని కేంద్రం
- 8మంది ఎంపిలు ఉన్నా అన్యాయమే
- కేంద్రమంత్రులకు అనేక లేఖలు రాసినా శూన్యం
- మరోమారు కేంద్రమంత్రి గిరిరాజ్‌కు కెటిఆర్ లేఖ



సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్దేశపూర్వక జాప్యం , వివక్షాపూరిత వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కె. తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు డిమాండ్ నిన్న మొన్నటిది కాదని, పేజి 2లో ▶

## జ్యూరిక్‌లో మంత్రి నారా లోకేశ్‌కు ప్రవాసాంధ్రుల ఘనస్వాగతం




2లో

## ఏడాదిన్నరలో రూ.23.5లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి: లోకేశ్

జ్యూరిక్: తెలుగువారు అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా ఉండాలని ఏపీ మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. స్విట్జర్లాండ్‌లో పర్యటిస్తున్న ఆయన జ్యూరిక్‌లో తెలుగు డయాస్పోరాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. "సముద్రాలు దాటి వచ్చినా మన సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 20 దేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ఈ సమావేశం కూటమి ప్రభుత్వానికి అదృష్టం లాంటిది. ఏడాదిన్నరలో ఏపీకి రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 16 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. అభివృద్ధి, ఐటీ, క్వాంటమ్ అంటూ ఏపీని సీఎం చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు" అని లోకేశ్ అన్నారు.



## భారత్ కోకింగ్ కోల్ బంపర్ లిస్టింగ్..

## ఇన్వెస్టర్లకు డబుల్ బొనాంజా




- **బంపర్ లిస్టింగ్:** ఐపీఓ (ఖ్రూ) ఇష్యూ ధర రూ. 23 కాగా, స్టాక్ మార్కెట్‌లో దాదాపు 96.5% ప్రీమియంతో (సుమారు రూ. 45 వద్ద) లిస్ట్ అయ్యింది.
- **రెట్టింపు లాభం:** షేర్లు అలాట్ అయిన ఇన్వెస్టర్లకు మొదటి రోజే దాదాపు రెట్టింపు లాభం లభించింది.

ఢిల్లీ: ప్రభుత్వరంగ సంస్థ కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్‌లోకి బంపర్ ఎంట్రీ ఇచ్చింది. ఇష్యూ ధర రూ.23 కాగా.. 96.5 శాతం ప్రీమియంతో లిస్టయ్యింది. బీఎస్ఈలో 96.56 శాతం ప్రీమియంతో రూ.45.21 వద్ద లిస్ట్ కాగా.. ఎన్ఎస్ఈలో 95.65 శాతం ప్రీమియంతో రూ.45 వద్ద లిస్టింగ్‌కు వచ్చింది. అంటే ఐపీఓలో షేర్లు అలాట్ అయినవారు దాదాపు రెట్టింపు ప్రతిఫలం పొందారన్నమాట. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.19,456.965 కోట్లుగా తేలింది.

భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ రూ.1,071 కోట్ల ఐపీఓలో భాగంగా ధరల శ్రేణిని రూ.21-23గా కంపెనీ నిర్ణయించింది. 2026లో మెయిన్‌బోర్డు కేటగిరీలో ఐపీఓకు వచ్చిన తొలి కంపెనీ కాగా.. ఆరంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. చివరిరోజు నాటికి రూ.1.17 లక్షల కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. మొత్తంగా 146.81 రెట్ల స్పందన అందుకుంది. పేజి 2లో

## డ్రైవర్‌కు ఫిట్స్.. ఆర్టీసీ బస్సు బోల్తా



గరివిడి: విజయనగరం జిల్లా గరివిడి మండలం అప్పన్నవలస వద్ద సోమవారం ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రాజాం నుంచి పల్లెవెలుగు బస్సు విజయనగరం వస్తోంది. ఈ క్రమంలో డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు, మరికొందరికి స్వల్పగాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవరు కండక్టర్‌తో కలిపి 87 మంది ఉన్నారు. డ్రైవర్ అప్పల గురువులు ఇప్పటికీ అపస్మారక స్థితిలో ఉన్నారు. ప్రమాద స్థలాన్ని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు, గరివిడి ఎస్సై లోకేశ్వరరావులు పరిశీలించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రియుడితో కలిసి భర్త హత్య.. భార్య సహా ముగ్గురు నిందితులు అరెస్టు



2లో

## ప్రయాణికుల ఫిర్యాదుపై స్పందించిన మంత్రి మండిపల్లి



2లో

# సంపాదకీయం

## జాషువా అడుగుజాడల్లో మధురకవి మల్లవరపు

కవి హృదయానికి అనివార్యంగా అమ్మతనం ఉండాలి. అమ్మ బలవర్ధకమూ జీర్ణయోగ్యమైన ఆహారాన్ని మాత్రమే బిడ్డకు అందించినట్లుగా కవి కూడా సమాజానికి అవసరమైన తాత్త్వికస్ఫూర్తిని పాఠకవిధేయంగా కవిత్వంలో ప్రబోధించాలి. వేమన నుండి గద్దర్ వరకూ అనేకమంది మహాకవులు ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించి సాహిత్యానికి సమున్నత విలువనూ విస్తృతినీ సమకూర్చారు. ఇదే ఎరుకతో జాషువా లాంటి కవులు పద్యకవిత్వాన్ని మరోమలుపు తిప్పారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువా మార్గంలో మడమ తిప్పకుండా పయనించిన సాహితీమూర్తుల్లో విశిష్టకవి మల్లవరపు జాన్.

జాన్ పేరు ఈ తరం వచన కవులకు పరిచయం లేకపోవచ్చు. దివాకర్ల వెంకటావధాని, విశ్వనాథ సత్యనారాయణ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, కరుణశ్రీ, సినారె, బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్, నాగభైరవ కోటేశ్వరరావు, బేతవోలు రామబ్రహ్మం వంటి సుప్రసిద్ధ కవి పండితులకు మాత్రం నులివెచ్చని రాగిముద్ద లాంటి ఆయన పద్యకవిత్వం పరమ ఇష్టం. “తేనెలూరు తెల్గు తీరు గనుంగొన కోర్కె వొడమువారు” మల్లవరపు జాన్ కావ్యాలను పరిశీలించమని తుమ్మల సీతారామమూర్తి రసహృదయులకు పిలుపునిచ్చాడు. “జాన్ పద్యం మాధుర్యగుణ భూయిష్ఠమైన”దని ‘అతుకుల బ్రతుకులు’ కావ్య పీఠికలో దాశరథి కితాబిచ్చాడు.

‘మధురకవి’గా ప్రఖ్యాతిగాంచిన మల్లవరపు జాన్ 1927 జనవరి 22న ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఒంగోలు తాలూకా చీమకుర్తిలో దావీదు, రత్నమ్మ దంపతులకు జన్మించాడు. “చెప్పులు కుట్టి జీవనము సేయు కుటుంబము నందు బుట్టి, చిన్నప్పటి నుండి శారద పదార్చన జేసితి” అని ఈ కవి చెప్పుకున్నట్లుగానే-- అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, కఠోర కృషితో జ్ఞానార్జన చేసి, ఉద్దండ పండితులను ఢీకొని, ప్రభావశీలమైన పద్యకవిగా జాన్ రాణించాడు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన జాన్ తర్వాత ప్రథమశ్రేణి తెలుగు పండితుడై వందలాదిమంది శిష్యులకు భాషా సాహిత్యాను బోధించి, ఉత్తమ గురువుగా ప్రకాశంజిల్లాలో పేరు గాంచాడు.

ప్రారంభ దశలో ముత్యాల సరాల శైలిలో గేయ కవిత్వం రాశాడు. ఒంగోలులోని శఠగోపనాచార్యుని సహకారంతో సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలను, పంచకావ్యాలను అధ్యయనం చేసి, పద్యకవిత్వం వైపు కలం సారించాడు. పౌరాణిక పద్య నాటకాల ప్రభావంతో క్రైస్తవ ఇతివృత్తం నేపథ్యంలో జాన్ రాసిన ‘సాంసన్ దెలీల’ (1967) పద్యనాటకం ఆయనకు ఎంతగానో పేరు తెచ్చింది. ‘విశ్వప్రకాశం’ (1973), ‘అతుకుల బ్రతుకులు’ (1981), ‘కాంతిరేఖలు’ (1987), ‘సూక్తిశతకం’, ‘సరసవినోదిని’ (1991), ‘చిరస్మరణీయులు’ (1993), ‘భావ విపంచి’ (1996), ‘పుణ్య పురుషుడు’ (2005) వంటి ఖండకావ్యాలతో, కృతులతో మల్లవరపు జాన్ ఆధునిక పద్య కవిత్వంలో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నాడు. మైసూరు తదితర విశ్వవిద్యాలయాల్లో జాన్ రచనలు పాఠ్య గ్రంథలుగా ఉండటం అరుదైన విషయం. అవిద్య, పేదరికం, మద్యపానం, అధిక జనాభా, కుటుంబ నియంత్రణ, అవినీతి, లంచగొండితనం, వరకట్నం, మహిళాభ్యుదయం, దళితుల సంక్షేమం, కులనిర్మూలన, దేశభక్తి లాంటి అంశాలపట్ల ప్రజల్లో సదావగాహన కల్పించడానికి కవిత్వం ద్వారా జాన్ కృషి చేశాడు. అభ్యుదయ కవితా ప్రభంజనం తీరం దాటుతున్న సాహిత్య సందర్భంలో కవిగా రంగప్రవేశం చేసిన మల్లవరపు జాన్, అస్తిత్వ ఉద్యమాలు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న సందర్భంలో కన్ను మూశాడు (2006 ఆగస్ట్ 12).

ఈ నాలుగు దశాబ్దాల్లో సాగిన సామాజిక ఉద్యమాల మౌలిక ఆశయాలను ప్రతిభావంతంగా జాన్ అక్షరబద్ధం చేశాడు.

## బాదల్గాం గ్రామ సర్పంచ్ మమత నర్సింహులను ఘనంగా అభినందించిన మానవహక్కుల సంస్థ నాయకులు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 19సంగారెడ్డి జిల్లా

నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బాదల్గాం గ్రామ నూతన సర్పంచ్ మమత నర్సింహులును నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, న్యాల్కల్ మండల అధ్యక్షులు బి. నవీన్, బి. రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామానికి చెందిన విజయ్ కలిసి సర్పంచ్‌ను అభినందించారు. నూతనంగా సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, గ్రామాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.అలాగే మహారాష్ట్ర రాష్ట్రం పూణే నగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్ షాప్ కార్యక్రమంలో సర్పంచ్ మమత నర్సింహులు పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, గ్రామస్థాయి సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్?ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.గ్రామాభివృద్ధి, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు మరియు సామాజిక సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. బాదల్గాం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగగా, గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది.

# ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

**పోలండ్ విదేశాంగ మంత్రితో భేటీలో జైశంకర్**
**ఉగ్రవాద నిర్మలనకు కలసి పనిచేస్తామని పోలండ్ హామీ**



ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ సమర్థించదని, ప్రపంచ దేశాలను కూడా ఇదే కోరుతోందని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కి బజీలి తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ దిల్లీలో సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. కాగా గతేడాది అక్టోబర్‌లో పాక్ పర్యటనకు వెళ్లిన సమయంలో పోలండ్ విదేశాంగ మంత్రి జమ్మూకశ్మీర్‌పై చేసిన సూచనలపై జైశంకర్ ఆయనకు చురకలు అంటించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు కూడా ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో రాడోస్లావ్‌కు తెలుసని జైశంకర్ అన్నారు. దానిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే గానీ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి ఆజ్యం పోయకూడదని చురకలు అంటించారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను మాత్రమే లక్ష్యం చేసుకోవడం అన్యాయమన్నారు. భారత్-పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జైశంకర్ వ్యాఖ్యలపై రాడోస్లావ్ సికోర్స్కి స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. పోలండ్ కూడా ఉగ్ర సమస్యలను ఎదుర్కొంటుందని తెలిపారు. కాగా గతేడాది పోలండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆ దేశ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

# వందేభారత్‌లో బిన్నంగా టిక్కెట్ క్యాన్సిలేషన్ రూల్

**నాలుగు గంల ముందు వరకు నో రిటర్న్**

దేశంలో వందేభారత్ స్లీపర్ రైలు ఎట్టకేలకు పట్టాలెక్కింది. ఈ నేపథ్యంలో ఈ రైలు టికెట్లకు సంబంధించి రైల్వే మంత్రిత్వశాఖ కీలక ప్రకటన చేసింది. టికెట్ క్యాన్సిలేషన్ నిబంధనలను కఠినతరం చేసింది. సాధారణ రైళ్లతో పోలిస్తే ఈ రైలు టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీలు భిన్నంగా ఉంటాయి. సాధారణ రైళ్లలో చివరి 4 గంటల వరకు టికెట్ రద్దు చేసినా పాక్షికంగా టికెట్ డబ్బులు వెనక్కి వస్తాయి. వందేభారత్ స్లీపర్ రైలులో మాత్రం అలా కాదు. ప్రయాణానికి 8 గంటల కంటే తక్కువ సమయం ఉంటే టికెట్ రద్దు చేసినా ఒక్క రూపాయి కూడా వెనక్కి ఇవ్వరు. ఈ మేరకు రైల్వే పాసింజర్స్ రూల్స్, 2015ను సవరించారు. 72 గంటల కంటే ముందు రద్దు చేస్తే టికెట్ ధరలో 25శాతం కోత విధిస్తారు.

## సిరిసిల్ల పవర్‌లూమ్‌పై కేంద్రం వివక్ష

మొదటి పేజీ తరువాయి

గత పదేళ్లుగా తాము నిరంతరాయంగా పోరాడుతున్నామని గుర్తు చేశారు. గతంలో మంత్రిగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, సిరిసిల్లా శాసన సభ్యుడిగా పూర్వపు టెక్స్ టైల్ శాఖా మంత్రులకు రాసిన అనేక లేఖలు, అనేక వ్యక్తిగత సమావేశాలు , అధికారిక విజ్ఞప్తులు ఇప్పటివరకు కేంద్రం నుండి ఎటువంటి సానుకూల నిర్ణయానికి నోచుకోకపోవడం అన్యాయమన్నారు. అరుణ్ జైట్లీ , స్మృతి ఇరానీ మొదలుకొని నేటి మంత్రి వరకు ప్రతి ఒక్కరినీ బతిమిలాడాం. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర కేంద్రం వివక్షకేవలం ఉత్సవ విగ్రహాల్లా మారారన్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా, కేంద్ర మంత్రివర్గంలో చోటు ఉన్నా, సిరిసిల్ల నేతన్నల గోడును వినిపించడంలో వారు విఫలమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. వచ్చే కేంద్ర బ్జడెట్‌లోనైనా సిరిసిల్ల ’ మెగా పవర్ లూమ్ క్లస్టర్ ’ను అధికారికంగా ప్రకటించి, ఈ పదేళ్ల అన్యాయానికి ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.సీపీసీడీఎస్ నిబంధనల ప్రకారం సిరిసిల్లకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర బృందాలే ధ్రువీకరించినా, ్గ÷శ్లైను పక్కన పెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటి? అని ప్రశ్నించారు.తెలంగాణ అంటే కేంద్రానికి ఎందుకంత కక్ష? అని ప్రశ్నించారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు. తెలంగాణ అభివృద్ధిని, ముఖ్యంగా ఇక్కడి నేతన్నల పట్ల కేంద్రం చూపుతున్న వివక్ష అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సిరిసిల్ల తెలంగాణ వస్త్ర పరిశ్రమకు గుండెకాయలాంటిదని పేర్కొన్నారు. సిరిసిల్ల లో 30 వేలకు పైగా పవర్ లూమ్స్ కలిగి ఉండి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్ల కంటే తక్కువ సామర్థ్యం, తక్కువ కార్మిక శక్తి ఉన్న ఇతర రాష్ట్రాలలోని ప్రాంతాలకు మెగా క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్రం, అన్ని అర్హతలు ఉన్న సిరిసిల్లను పక్కన పెట్టడం ప్రాంతీయ వివక్షకు పరాకాష్ట అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మెగా క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, నిరంతర విద్యుత్, నీరు, సింగిల్ విండో అనుమతులు , రాష్ట్ర స్థాయి ప్రోత్సాహకాలు.. ఇలా ప్రతి ఒక్క అర్హతను పూర్తి చేసిందని కేటీఆర్ వివరించారు. ఇవన్నీ సిద్ధంగా ఉన్నాయని పదేపదే చెబుతున్నా, ఎటువంటి సాంకేతిక లేదా ఆర్థిక కారణాలు చూపకుండా కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటు అని ఎండగట్టారు. ఒకవైపు ’ మేక్ ఇన్ ఇండియా’, ’ఆత్మనిర్భర్ భారత్’ అని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం, తెలంగాణ విషయంలో ద్వంద నీతికి, చిత్తశుద్ధిలేమికి అద్దంపడుతుందన్నారు. ÷ూష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చిన నాటి నుంచి చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మళ్లీ ఆత్మహత్యల వార్తలు వినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలకు అండగా నిలిచింది. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయి. ఇటువంటి కీలక సమయంలో కేంద్రం జోక్యం చేసుకుని మెగా క్లస్టర్‌ను మంజూరు చేయాల్సి ఉండగా, తీవ్రమైన జాప్యం చేయడం నేతన్నల

# ప్రియుడితో కలిసి భర్త హత్య.. భార్య సహా ముగ్గురు నిందితులు అరెస్టు

మొదటి పేజీ తరువాయి

అనకాపల్లి పట్టణం: ప్రియుడితో అక్రమ సంబంధం కొనసాగించేందుకు అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయించింది భార్య. ఈ ఘటన అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం తురువోలు గ్రామంలో జరిగింది. ఈ కేసుకు సంబంధించి మృతుడి భార్య సహా ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణి వివరాలు వెల్లడించారు.

డీఎస్పీ మాట్లాడుతూ.. “తురువోలుకి చెందిన దేగల చిన్న, కొండమ్మకు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 12 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. చిన్న, అతని భార్య కొండమ్మ 2024లో వాకపల్లి గ్రామస్థులతో కలిసి తెనాలిలో కూలీ పనికి వెళ్లారు. ఇక్కడ కొండమ్మకు మేస్త్రీ గణేశ్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త చిన్న.. కొండమ్మను తీసుకొని స్వగ్రామానికి వచ్చేశాడు. అయినా తరచూ కొండమ్మ.. గణేశ్‌తో ఫోన్లో మాట్లాడుతుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి.

ఈ నేపథ్యంలో చిన్నను అడ్డుతప్పించుకోవాలని భార్య కొండమ్మ భావించింది. విషయాన్ని ప్రియుడికి చెప్పడంతో ఈనెల 14న తెనాలి నుంచి గణేశ్, అతడి బంధువు శివకుమార్ చోడవరం వచ్చారు. చిన్న.. ద్విచక్ర వాహనంపై తురువోలు వస్తుండగా దారిలో గణేశ్, శివకుమార్ దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచి హత్య చేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించారు. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయడంతో అసలు విషయం బయటపడింది” అని డీఎస్పీ వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన భార్య కొండమ్మ, ప్రియుడు గణేశ్‌తో పాటు హత్యకు సహకరించిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు.

# భారత్‌కు యూఏఈ అధ్యక్షుడు..

మొదటి పేజీ తరువాయి

ఇరు దేశాధినేతలూ చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కశ్మీర్‌పై సూచనలు.. పోలండ్ మంత్రికి జైశంకర్ చురకలు

ఇరాన్- అమెరికా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతినడం, యెమెన్ విషయంలో సౌదీ అరేబియా, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో రాజకీయ అస్థిరతలు నెలకొన్నవేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యూఏఈ అధ్యక్ష హోదాలో అల్ నహ్యాన్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇది మూడోసారి. 2022లో ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అనంతరం సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది.

# జ్యూరిక్‌లో మంత్రి నారా లోకేశ్‌కు ప్రవాసాంధ్రుల ఘనస్వాగతం

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద ఆయనకు ఎన్ఆర్ఐ తెదేపా నేతలు, ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు లోకేశ్ అక్కడి నుంచి దావోస్‌కు వెళ్లనున్నారు. ఏపీని నమ్మకమైన గ్లోబల్ గమ్యంగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. 90వ దశకంలోనే భారత్‌కు తొలి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్లలో సీఎం చంద్రబాబు ఒకరని పేర్కొన్నారు.

# ప్రయాణికుల ఫిర్యాదుపై స్పందించిన మంత్రి మండిపల్లి

మొదటి పేజీ తరువాయి

అమరావతి: రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విజయవాడ, విశాఖ వైపు బస్సులు లేవంటూ ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈటీవీలో వచ్చిన స్క్రోలింగ్‌పై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెంటనే స్పందించారు. డీపీటీఓతో ఫోన్‌లో మాట్లాడారు. విజయవాడ, విశాఖకు అదనపు బస్సులు ఏర్పాటు చేశామని అధికారులు వివరణ ఇచ్చారు. అదేవిధంగా నిన్న రాత్రి హైదరాబాద్‌కు వెళ్లిన బస్సులు తిరుగు ప్రయాణంలో ఉన్నట్లు తెలిపారు. ఇవాళ సాయంత్రం 10 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. చుట్టుపక్కల డిపోల నుంచి బస్సులు తరలించి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ, విశాఖ, హైదరాబాద్ వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# భారత్ కోకింగ్ కోల్ బంపర్ లిస్టింగ్..

మొదటి పేజీ తరువాయి

దీంతో బంపర్ లిస్టింగ్‌ను ముందే ఊహించారు. అందుకు తగ్గట్టే లిస్టింగ్‌లో అదరగొట్టింది.

రికార్డు పరుగులు.. రూ.3 లక్షలు దాటిన కిలో వెండి

1972లో భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటైంది. జారియా (ఝార?ండ్), రాణిగంజ్ (పశ్చిమ బెంగాల్)లోని కోల్ మైన్స్ నుంచి కోకింగ్ కోల్‌ను సరఫరా చేస్తోంది. కోల్ ఇండియా వాల్యూ అన్‌లాక్‌లో భాగంగా అనుబంధ సంస్థలో వాటాలను ప్రభుత్వం విక్రయించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఽఖీ) ద్వారా కోల్ ఇండియా 46.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించింది. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా నష్టంతో 83,039.21 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 165 పాయింట్ల నష్టంతో 25,529.25 వద్ద కొనసాగుతోంది.

# విధ్వంస పాలన క్రెడిట్ జగన్‌ది.. విజనరీ క్రెడిట్ చంద్రబాబుది: నిమ్మల



పాలకొల్లు: ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను జగన్ దారి మళ్లిస్తే.. దళితులు, క్రైస్తవులు, మైనార్టీల సంక్షమమే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రూ.కోటి 80 లక్షలతో క్రైస్తవ శ్మశాన వాటిక సుందరీకరణ, అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. “అధికారం దక్కలేదనే పగతో వైకాపా నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. విధ్వంస పాలన క్రెడిట్ జగన్‌ది.. విజనరీ క్రెడిట్ చంద్రబాబుది” అని నిమ్మల పేర్కొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు
20-01-2026

# శాస్త్రీయ ఆవిష్కరణలతో అభివృద్ధి దిశగా భారత్

**- సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్--2026 ప్రారంభం**
**- "దేశ అభివృద్ధికి సాంకేతికతే వెన్నుదన్ను నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు"**
**- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)19జనవరి సంగారెడ్డి**
శాస్త్రీయ ఆవిష్కరణలతో అభివృద్ధి దిశగా భారత్ కొత్త భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నేటి విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలు, వైజ్ఞానిక దృక్పథంతో రేపటి దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్?లో ఏర్పాటు చేసిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన--2026ను శనివారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, విఐటిఎం డైరెక్టర్ సాదు భాస్కర్, విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్?లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడం గర్వకారణమన్నారు.భారతదేశ అభివృద్ధిలో శాస్త్రీయ ఆవిష్కరణల పాత్ర అత్యంత కీలకమని, భవిష్యత్ భారత్ శాస్త్రసాంకేతికత ఆధారంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'తెలంగాణ రైజింగ్--2047' విజన్?లో శాస్త్రీయ దృక్పథం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అనుభవాత్మక విద్య ద్వారా విద్యార్థుల్లో ప్రశ్నించే మనస్తత్వం పెంపొందుతుందని, ఈ విధానం పాఠశాలలతో పాటు పాలిటెక్నిక్?లు, ఐటీఐలు, అడ్వాన్స్?డ్ ట్రైనింగ్ సెంటర్ల వరకూ విస్తరించాలన్నారు. ఈ తరహా సైన్స్ ఫెయిర్లు విద్యార్థుల్లో నేర్చుకునే తపనను మరింత పెంచుతాయని తెలిపారు.టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యతో పాటు వైజ్ఞానికంగా విద్యార్థులు ముందంజలో నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ అభివృద్ధికి సాంకేతికతే వెన్నుదన్నుగా నిలుస్తుందని పేర్కొన్నారు.విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ, ఎస్సీఈఆర్టీ, విఐటిఎం, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఇండివిడ్యువల్, గ్రూప్, టీచర్ల విభాగాల్లో 199 ఎగ్జిబిట్లు, అలాగే 24 ఎన్?జీఓల సైన్స్ స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 400 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటుండగా, ప్రతిరోజూ సుమారు 4 వేల మంది పాఠశాల విద్యార్థులు సందర్శించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కార్పొరేటర్ పుష్ప నగేష్, అడిషనల్ కలెక్టర్ పాండు, గాడియం స్కూల్ ప్రిన్సిపల్ కీర్తి రెడ్డి, సీఈఓ రామకృష్ణారెడ్డి, ఆర్జేడీలు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

**- అంగన్వాడి, పాఠశాల టాయిలెట్లు తప్పనిసరిగా వాడుకలోకి తీసుకురావాలి**
**- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య.**






**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)19జనవరి**
సంగారెడ్డి జిల్లా లో రాబోయే వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. అంగన్వాడి భవనాలు, పాఠశాల భవనాల్లో ఇప్పటికే నిర్మించిన టాయిలెట్లను వెంటనే వాడుకలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్?లో భాగంగా గ్రామాల వారీగా సర్వే నిర్వహించి పంప్ సెట్లు, పనిచేస్తున్న బోర్?వెల్?ల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. మైనర్ రిపేర్ల కోసం చెక్?లిస్ట్ తయారు చేసి గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. నారాయణఖేడ్ ప్రాంతంలో ముందస్తు సర్వే నిర్వహించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని తెలిపారు. గ్రామాలలో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ బోర్లు, ఇతర నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా జాయింట్ ఇన్?స్పెక్షన్లు నిర్వహించి సమస్యలు ఉత్పన్నం కాకముందే పరిష్కరించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మంజూరులు వేగంగా అందించాలని, ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాలు, పాఠశాలలు, అంగన్వాడి భవనాలకు సంబంధించిన టాయిలెట్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, మైనర్ రిపేర్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన టాయిలెట్లను 100 శాతం వాడుకలోకి తీసుకురావాలని, అందుకు అవసరమైన నీటి సరఫరా తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చెల్లించాల్సిన కూలీ డబ్బులను వెంటనే అందించాలని అన్నారు .అలాగే మహిళా సంఘాల భవనాలకు సంబంధించిన పూర్తి వివరాలను వచ్చే శుక్రవారం లోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఎంపీడీవోలు కలిసి గ్రామాలలో జాయింట్ పరిశీలనలు నిర్వహించి ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, పాఠశాలల్లో వాడుకలో లేని టాయిలెట్ల వివరాలు, స్కావెంజర్ హాజరు వివరాలు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు, జడ్పీ సీఈఓ మరియు జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, పీడీ డీఆర్డీఓ జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మండల పరిషత్ అధికారులు, హౌసింగ్ ఏఈలు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు భద్రత. గమ్యానికి చేరుకోవడమే కాదు సురక్షితంగా చేరుకోవడం అసలైన విజయం





**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)19జనవరి సంగారెడ్డి జిల్లాలో**
రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్--2026' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని సోమవారం సంగారెడ్డి పట్టణంలోని సంయుక్త పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ భద్రతపై దిశానిర్దేశం చేసిన ఎస్పీ గారు, విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను తాము పాటించడమే కాకుండా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలు, పాటల ద్వారా ట్రాఫిక్ అవగాహన సందేశాలను ప్రదర్శిస్తూ ఎస్పీ గారికి ఘన స్వాగతం పలికారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించిన ఎస్పీ గారు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వాడాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓవర్ స్పీడ్ క్షణిక ఆనందానికే పరిమితం అవుతుందని, కానీ ప్రాణాలకు ముప్పుగా మారుతుందని అన్నారు.అనంతరం 'అరైవ్ అలైవ్--2026' పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ గారు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. హెల్మెట్ తలకే కాకుండా కుటుంబానికి భద్రతనిస్తుందని పేర్కొంటూ, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా వాహనదారులతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.రోడ్డు భద్రతా అవగాహనలో భాగంగా మహిళా కానిస్టేబుల్ వనజ ట్రాఫిక్ నియమాలను ప్రతిబింబించేలా రంగురంగుల ముగ్గును రూపొందించగా, ట్రాఫిక్ నిబంధనలను కళ్లకు కట్టినట్లు చూపినందుకు జిల్లా ఎస్పీ గారు ఆమెను అభినందించారు.ఈ కార్యక్రమంలో సంయుక్త పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కొండాపూర్ ఇన్స్పెక్టర్ సుమన్ కుమార్, ఎస్?ఐ సోమేశ్వరి, మునిపల్లి ఎస్?ఐ రాజేష్ నాయక్, పాఠశాల యాజమాన్యం తదితరులు

# అనారోగ్యంతో బాధపడుతున్న సంజయ్ కుమార్‌ను పరామర్శించిన


**- జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుఱ్ఱపు మచ్చేందర్**



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 19సంగారెడ్డి జిల్లా**
మనూరు మండల పరిధిలో అనారోగ్య సమస్యతో బాధపడుతున్న సంజయ్ కుమార్?ను జి ఎన్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్?ఎస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సంజయ్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చి, అన్ని విధాలుగా తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజా సమస్యల పట్ల పార్టీ నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ర్యాలమడుగు మాజీ ఎంపీటీసీ అంర్య నాయక్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, దామరగిద్ద మాజీ సర్పంచ్ శంకర్ సాగర్, బీఆర్?ఎస్ పార్టీ యువ నాయకులు కార్తీక్, సందీప్, ప్రశాంత్, మాజీ వార్డు మెంబర్ సాయిలు, రాజు, అనిల్, చింటూ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా కడాల మౌనిక రాములు


**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 19సంగారెడ్డి జిల్లా**



జోగిపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లపై ఉత్కంఠకు తెరపడింది. అందోల్--జోగిపేట మున్సిపల్ పరిధిలో 11వ వార్డు బీసీ జనరల్?గా కేటాయించడంతో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా కడాల మౌనిక రాములును పార్టీ ఖరారు చేసింది.గతంలో బీజేపీ పార్టీలో కార్యకర్తగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కడాల రాములును పార్టీ ప్రత్యేకంగా గుర్తించి ఈసారి టికెట్ కేటాయించింది. పార్టీ సిద్ధాంతాలు, ఆదేశాల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తనపై నమ్మకంతో ఆశీర్వదించి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజలు గెలిపిస్తే ఏ ఆపద వచ్చినా ముందుండి ప్రజల కోసం పనిచేసే నాయకత్వాన్ని అందిస్తానని తెలిపారు. కుల, మత భేదాలు లేకుండా అందరినీ కలుపుకొని వెళ్లే తత్వం తనదని ఆయన పేర్కొన్నారు

# పోలీస్ నిర్బంధాలకు వ్యతిరేకంగా 'చలో కోదాడ'కు పిలుపు: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ, సందేశం టైమ్స్:**
కోదాడ నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలుగా సామాన్యులపై అక్రమ







కేసులు బనాయిస్తూ, వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 24న 'చలో కోదాడ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రకటించారు.
సోమవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. కర్ల రాజేష్ పోలీస్ హత్యతో పాటు, నియోజకవర్గంలో కొనసాగుతున్న అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలపై తమ నిరసన గళాన్ని వినిపిస్తామని ఆయన తెలిపారు.

**ప్రజాస్వామ్యయుత పోరాటం:**
ప్రభుత్వ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సింది పోయి, సామాన్యులను వేధింపులకు గురిచేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా అక్రమ కేసులకు గురైన బాధితులు, బీఆరచవతీచస్ (దీ=ూ) శ్రేణులు, పార్టీ కార్యకర్తలు మరియు సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ 'చలో కోదాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బాధితులకు అండగా నిలబడేందుకు ఈ పోరాటం చేపట్టినట్లు మల్లయ్య యాదవ్ స్పష్టం చేశారు.

# బాల సదన్, భరోసా కేంద్రాలను తనిఖీ చేసిన

**-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 19సంగారెడ్డి జిల్లా**



జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సూచనలతో సోమవారం సంగారెడ్డిలోని బాలసదన్, భరోసా కేంద్రాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లలకు అన్ని చట్టాలపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారి బాగోగులు, భద్రత, సంరక్షణపై నిరంతరం దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమశిక్షణ పాటించాలనిసూచించారు.విద్యార్థులు మంచి చదువులు చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు న్యాయ సంబంధిత సమస్యలు ఎదుర్కొన్న సందర్భంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలిపారు. అవసరమైతే సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ సంపూర్ణ మద్దతు

**- స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ వేగవంతం చేయాలి**
**- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి 19సంగారెడ్డి జిల్లా**




మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక పథకాల ద్వారా విస్తృతంగా చేయూతనిస్తున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక-- ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాల మంజూరు, అర్హులైన వారికి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్?లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులతో వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అర్హులైన సంఘ సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీని నిర్దేశిత కాలంలో పూర్తిచేయాలని సూచించారు. మహిళా సంఘాల్లో సభ్యులు కాని అర్హులైన వారిని రేషన్ కార్డుల ఆధారంగా గుర్తించాలని తెలిపారు. పంపిణీ సమయంలో ఎలాంటి రద్దీ, అవ్యవస్థలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాచారి, ఈడీఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు, డీఎంసీ మల్లేశ్వరి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజ్య శ్యామలాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**- ప్రథమ దినం శ్రీ శ్యామలా బాలదేవిగా అమ్మవారి దర్శనం**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)జనవరి**



జిల్లా వట్పల్లి మండలం పరిధిలో నీ దుద్యాల గ్రామంలో శ్రీ రాజ్య శ్యామలాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నేడు భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ప్రథమ దినాన అమ్మవారు శ్రీ శ్యామలా బాలదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా లోక కళ్యాణార్థం, సమస్త భక్తుల శ్రేయస్సు కోరుతూ అమ్మవారి ఆరాధనతో పాటు హవన కార్యక్రమాన్ని నిర్వహించారు.శ్రీ శ్యామలా బాలదేవి విశేషాన్ని పురస్కరించుకుని, ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే పిల్లలకు సంపూర్ణమైన విద్యా జ్ఞానం లభిస్తుందని పండితులు తెలిపారు. అందువల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.మరల సాయంకాలం హోమం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని వారు కోరారు. తొమ్మిది రోజులపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో హోమ కార్యక్రమాలు కొనసాగనున్నాయని తెలిపారు.అమ్మవారి పూజలు, హోమాలలో కూర్చునేందుకు ఆసక్తి గల భక్తులు 9618951629 నంబర్?ను సంప్రదించవచ్చని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాలు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా నిర్వహించబడుతున్నాయని, ఆన్?లైన్ సేవ కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.అందరూ భక్తులు అమ్మవారిని దర్శించి పునీతులై, అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని నిర్వాహకులు కోరారు.లోకా సమస్తా సుఖినో భవంతు.

# అరైవ్ అలైవ్ - 2026 రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్)19జనవరి సంగారెడ్డి జిల్లాలో**



రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజలకు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉద్యమమే "అరైవ్ అలైవ్ - 2026" అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ గారి ఆదేశానుసారం ఈ రోజు తేది: 19.01.2026 నాడు జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిదిలో ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యత, ప్రమాదాల నివారణ వంటి అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ విదిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించాలని, రోడ్లపై పాదాచారులకు ప్రాధాన్యతను ఇవ్వవలసిందిగా ఎస్పీ సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపవరాదని, మద్యం మత్తులో ఏకాగ్రతను కోల్పోయి ప్రమాదాకు దారితీయవచ్చు అన్నారు.

# నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ ప్రారంభం

**- గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం**
**- 'గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సర్పంచులు బాధ్యతాయుతంగా పనిచేయాలి"**
**- టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి**



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (టీ. సంగమేశ్వర్) జనవరి 19 సంగారెడ్డి జిల్లాలోని**

గ్రామాల సర్వత్రా అభివృద్ధిలో సర్పంచ్?ల పాత్ర అత్యంత కీలకమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. గ్రామ స్థాయిలో సమర్థవంతమైన పాలన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.సోమవారం సంగారెడ్డి పట్టణంలోని దుర్గాబాయి దేశ్?ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం, ప్రజా న్యాయవ్యవస్థలో ప్రజాప్రతినిధుల పాత్ర, పంచాయతీరాజ్ చట్టంలోని కీలక అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవ్వాలంటే సర్పంచ్?లు బాధ్యతాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్?లు సమర్థంగా పనిచేస్తే గ్రామాలకు మంచి పేరు వస్తుందని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ద్వారా సర్పంచ్?లకు కల్పించిన అధికారాలు, విధులను పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి కీలక అంశాల్లో సర్పంచ్?లు చురుకుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గ్రామ పాలన విధులు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి ప్రణాళికలు, ఆదర్శ గ్రామపంచాయతీల నిర్మాణం సర్పంచ్?ల ప్రధాన బాధ్యతలని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులే హాజరు కావాలి**

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ అభివృద్ధికి పునాదని తెలిపారు. ప్రజాప్రతినిధులుగా సర్పంచ్?లు తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సర్పంచులు స్వయంగా మాత్రమే హాజరుకావాలని, వాటిని ఇతరులకు అప్పగించరాదని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ ప్రాథమిక విధులు, పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, ప్రజారోగ్యం, గ్రామ కార్యదర్శుల బాధ్యతలపై వివరించారు. గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి క్రమపద్ధతిలో అమలు చేయాలని సూచించారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ఆదర్శ గ్రామాల దిశగా అడుగులు వేయాలన్నారు.జిల్లాలో మొత్తం 613 మంది సర్పంచులకు శిక్షణ అందించనున్నట్లు జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి తెలిపారు. ఒక్కో బ్యాచ్?కు 100 మందికి శిక్షణ ఇస్తామని, ఈ కార్యక్రమాలు ఈరోజు నుంచి మార్చి 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డీఎల్పీఓలు అనిత, అమృత, సంజీవరావు, పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి పిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలి

**- అన్ని శాఖలు డీడీఓ బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాలి**
**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సందేశం టైమ్స్:**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన పిర్యాదులపై సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వివిధ శాఖలలో చాలా కాలంగా పెండింగ్?లో ఉన్న పిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొన్ని శాఖల్లో పెండింగ్ దరఖాస్తులు అధికంగా ఉన్నాయని వాటిని తగ్గించుకోవాలని అధికారులకు ఆదేశించారు.అలాగే జిల్లాలోని ప్రతి శాఖ తమ తమ డీడీఓ (ఐఐూ) బ్యాంక్ అకౌంట్ వివరాలను జిల్లా అకౌంట్ వెరిఫికేషన్ కమిటీకి సంబంధిత ప్రొఫార్మాలో పూర్తి చేసి కమిటీ ముందు హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.


ఈ ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 21 దరఖాస్తులు, డీడబ్ల్యు ఓ -- 5, డీపీఓ -- 4, డీఎం అండ్ హెచ్ ఓ -- 2



కాగా, మిగిలిన 11 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవిగా ఉన్నాయని తెలిపారు. మొత్తం 43 దరఖాస్తులు అందాయని, వాటిని పరిష్కారానికి శాఖల వారీగా పంపించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీఈఓ అశోక్, డీఎం అండ్ హెచ్ ఓ పి. వెంకటరమణ, డీఎసచవతీతీచ మోహన్ బాబు, సిపిఓ కిషన్ నాయక్, సంక్షేమ అధికారులు దయానంద్ రాణి, శంకర్, నరసింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీకి సర్వం సిద్ధం

**- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క**
**- అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరాలి: కలెక్టర్లకు ఆదేశం**
**- సూర్యాపేట జిల్లా నుండి పాల్గొన్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట, సందేశం టైమ్స్:**

మున్సిపల్ మరియు పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీతో పాటు, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్?లతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**అంతరాయం లేకుండా పంపిణీ:**

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వడ్డీ లేని రుణాల పంపిణీ మహిళలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. చీరల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులను కోరారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

**సూర్యాపేట జిల్లా యంత్రాంగం సన్నద్ధం:**

ఈ వీడియో కాన్ఫరెన్స్?లో సూర్యాపేట జిల్లా నుండి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ కె. సీతారామారావు పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో రుణాల పంపిణీ, చీరల పంపిణీని పకడ్బందీగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (ఐజూ) శ్రీధర్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, హుజూర్నగర్ మున్సిపల్ కమిషనర్, మెప్మా ప్రాజెక్టు అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మీ ఇంటి బిడ్డగా నన్ను ఆశీర్వదించండి

**- 6 వ వార్డు అభ్యర్థి బరిలో లావణ్య ప్రవీణ్ కుమార్**

**సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా ప్రతినిధి(టీ. సంగమేశ్వర్)19 జనవరి సంగారెడ్డి జిల్లా**

ఆందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి మంత్రి దామోద రాజనర్సింహ ఆశీర్వాదంతో మ్యాతరి లావణ్య ప్రవీణ్ కుమార్ సంసిద్ధంగా ఉన్నారు. వార్డుల వారిగా రిజర్వేషన్లు వెలువడటంతో ఎన్నికల సంఘం 6 వ వార్డు ౹ాజ మహిళా రిజర్వేషన్ రావడంతో ప్రజాసేవ చేయడానికి లావణ్య ప్రవీణ్ కుమార్ వార్డు అభివృద్దే లక్ష్యంగా ముందుకు వస్తున్నారు. మీ అండదండలు మాకే ఉండాలని నా వార్డు ప్రజలు నన్ను ఆదరించి ఆశీర్వదిస్తారని లావణ్య ప్రవీణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.



పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.